17వ సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,13 ఫిబ్రవరి 2024




## అపెక్స్ బాడీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న తేజ్ భరత్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పట్టణ సహకార బ్యాంకుల నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ (చీూఖీజఖదీ) యొక్క అపెక్స్ బాడీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించు కోవడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. సోమవారం ఉదయం న్యూఢిల్లీలో జరిగిన చీూఖీజఖదీ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా జేసీ ఎన్.తేజ్ భరత్ వివరాలు తెలియచేస్తూ, దేశవ్యాప్తంగా చీూఖీజఖదీలో అపెక్స్ బాడీలో 386 పట్టణ కో-ఆపరేటివ్ బ్యాంకులు సభ్యత్వం కలిగి ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 46 బ్యాంకుల ప్రతినిధులు హాజరైనట్లు జెసి తేజ్ భరత్ వెల్లడించారు. ఈ అపెక్స్ బాడీ సమావేశంలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన తెలియ చేశారు. గ్రామీణ సహకార బ్యాంకులు డైరెక్టర్ల పోస్టులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారనీ, పట్టణ సహకార బ్యాంకులు డైరెక్టర్ల పోస్టులు భర్తీ కోసం జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తేజ్ భరత్ తెలియజేశారు.

# సామాజిక స్థలాలు మాయం





**- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం**
**- కోట్లకు పడగలెత్తిన వైసిపి నాయకత్వం**

**కాకినాడ,మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కంచె చేను మేసిన విధంగా మారింది ప్రభుత్వ పనితీరు. నవరత్నాలు అందరికీ ఇళ్లు పథకంలో భారీ ఎత్తున ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చిన లేఔట్‌లలో సామాజిక భవనాల కోసం ఖాళీ స్థలాలు వదిలారు. లేఅవుట్ పర్మిషన్ కావాలంటే ఖచ్చితంగా సామాజిక స్థలాన్ని చూపించాలి. అందులో పార్కులు లేదా సామాజిక భవనాలు నిర్మించాల్సి ఉంటుంది. వాటిని పంచాయతీలు, పురపాలక సంస్థలకి రిజిస్ట్రేషన్ చేసే అప్పగించాలి. కానీ కొందరు వైసీపీ నాయకులు భారీ అవినీతికి తెర తీశారు. కొందరు వైసిపి ద్వితీయశ్రేణి నాయకులు సామాజిక స్థలాలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని గుట్టు చప్పుడు కాకుండా విక్రయించేశారు. కాకినాడ నగరంలోని లబ్దిదారుల కోసం పెదపూడి మండలం అచ్చుతాపురత్రయంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇదే మండలంలో ఆ స్థలాలు ఎదురుగా పెదపూడి మండల లబ్దిదారుల కోసం స్థలాలు కేటాయించారు. కాకినాడ ప్రజల కోసం సెంటు స్థలం ఇస్తే అదే ప్రాంతంలో పెదపూడి మండల ప్రజల కోసం సెంటున్నర వంతున ఇళ్ల స్థలాలు ఇచ్చారు. పెదపూడి మండల ప్రజలకు ఇచ్చిన లేఔట్‌లో ఆరు సామాజిక స్థలాల కోసం స్థలాలు కేటాయించారు. వాటిని వేరే వారు స్వాధీనం చేసుకున్నారు, విక్రయించేశారు. అదేవిధంగా కాకినాడ ప్రజల కోసం ఇచ్చిన లేఔట్‌లో మూడు సామాజిక స్థలాలు ఉన్నాయి. వాటిని కూడా కైంకర్యం చేసేశారు. నిబంధనల ప్రకారం అక్కడ ఆరు, ఇక్కడ మూడు మొత్తం తొమ్మిదింటిని కూడా అచ్చుతాపురత్రయం గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలి. కాని పెదపూడి తాసిల్దారు, గ్రామ కార్యదర్శి వీటిని పట్టించుకోలేదు. దీంతో ఈ స్థలాలు అన్యాక్రాంతం అయిపోయాయి. ఇక్కడ నివాసం ఉంటున్నవారికి సామాజిక స్థలం లేకుండా పోయింది. కొందరు ప్రజాప్రతినిధుల మద్దతు ఇందులో ఉన్నట్లు చెబుతున్నారు. కేవలం ఈ రెండు చోట్ల మాత్రమే కాదు. కాకినాడ జిల్లాలోని పలు నియోజవర్గాలలో ఇదే పరిస్థితి ఉందని జిల్లా పంచాయతీ కార్యాలయానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు. సామాజిక స్థలాలు విక్రయించేసి అన్యాక్రాంతం చేసినా పంచాయతీలు, పురపాలక సంఘాలు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. జగనన్న లేఔట్లలో సామాజిక స్థలాలు విక్రయించడంపై హైకోర్టులో కేసు వేస్తున్నట్లు సామాజిక కార్యకర్త ఒకరు వెల్లడించారు. ఇదే జరిగితే పలువురు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

## వేంకటేశ్వరాలయం, కల్యాణం చూతము రారండి

**- 14వ తేదీన వేడుకగా విగ్రహప్రతిష్ఠకు ఏర్పాట్లు**
**- 16న కల్యాణోత్సవం - ఎమ్మెల్యే ద్వారంపూడి**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** భక్తుల అభీష్టానికి అనుగుణంగా లోకకల్యాణార్థం ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా కేంద్రం కాకినాడ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి పేరిట అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదిక కానుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్ర శేఖరరెడ్డి చెప్పారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ సాంబమూర్తినగర్‌లో పూర్తి రాతికట్టడంతో నిర్మించిన శ్రీశ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈ నెల 14వ తేదీన విగ్రహప్రతిష్ఠ చేయనున్నట్టు చెప్పారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పర్యవేక్షణలో వైష్ణవ సాంప్రదాయం ప్రకారం పురోహితులు, పండితుల సమక్షంలో బుధవారం ఉదయం 10.58 నిమిషాలకు ఈ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ.4 కోట్లు వెచ్చించి ఆ మొత్తం సొమ్మును ఎలాంటి విరాళాలు వసూళ్ళు చేయకుండా తన కుటుంబం ద్వారానే సమకూర్చి పూర్తి రాతికట్టడంతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేసినట్టు ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు. నిపుణులైన శిల్పులతో ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దగలిగామని చెప్పారు.

**15న తిరువీధి మహోత్సవం :** విగ్రహప్రతిష్ఠ అనంతరం 15వ తేదీన ఉదయం 8 గంటలకు వైభవ వేంకటేశ్వర దివ్యక్షేత్రం నుంచి ఆనందభారతి గ్రౌండ్స్ వరకు ప్రాభోధిక సేవ అనంతరం తిరువీధి మహోత్సవం నిర్వహిస్తా మన్నారు.. కోలాట నృత్యాలు, స్వామివారికి, అమ్మవారికి మంగళస్నానం, వనిత భక్తులకు గోరింటాకు ధరింపచేయడం వంటి కార్యక్రమాలు అనంతరం సాయంత్రం కల్యాణమూర్తులకు మంగళస్నానం, వేదనాథ నృత్యసంగీత సమ్మేళనంతో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే దాండియా నృత్యసేవ కూడా జరుగుతుందన్నారు.

**16న కల్యాణోత్సవం :** ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు కాకినాడ రంగరాయ వైద్యకళాశాల గ్రౌండ్స్‌లో శ్రీ శ్రీనివాస దివ్యకళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్టు చెప్పారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు కల్యాణాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. ఇంతటి మహాకార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. పై కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ జొన్నాడ చినబాబు ఉన్నారు.

## టీడీపీ నుండి వైఎస్సార్ పార్టీలో చేరికలు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్:** రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (బాబు) సమక్షంలో వైసీపీ పార్టీలో తన అనుచరగణంతో ఐ.పోలవరం పంచాయితీ టీడీపీ వార్డు మెంబరు మల్లిన బాబి సోమవారం చేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పార్టీ నాయకులు మాట్లాడుతూ త్వరలో టీడీపీ నుండి మరికొందరు వైసీపీ పార్టీలో చేరనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఐ.పోలవరం సర్పంచ్ కుంజం వెంకటలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు శారపు అప్పారావు, వైస్ సర్పంచ్ పండా సూరిబాబు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ పంపిణీ లక్ష్యం

**- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి**
**- రూ.8.14 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ ప్రజలకు ఎటువంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ ను అందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పరలోపేటలో రూ.8.15 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి సోమవారం ప్రారంభించారు. సుమారు 2052 టిడ్కో గృహ సముదాయాలతోపాటు పరిసర ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఈ సబ్ స్టేషన్ నిర్మాణమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కొత్త సబ్ స్టేషన్ వల్ల స్థానికంగా ఉండే టిడ్కో నివాసాలతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ఎలాంటి లో వోల్టేజి సమస్యలేని విద్యుత్‌ను అందించగలమన్నారు. బీచ్ రోడ్‌లో కూడా త్వరలోనే అధిక సామర్థ్యం కలిగిన మరో సబ్ స్టేషన్ నిర్మాణం కాబోతోందన్నారు. జగన్నాధపురం ప్రాంతానికి కూడా రెండు సబ్ స్టేషన్‌లో అవసరమని, అవి కూడా పూర్తయితే కాకినాడ నగరంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అవాంతరాలులో వోల్టేజీ లేని నాణ్యమైన విద్యుత్ పూర్తి స్థాయిలో అందించగలుగుతామన్నారు. సబ్ స్టేషన్‌ను యుద్ధ ప్రాతిపదికన అతి తక్కువ వ్యవధిలో పూర్తిచేసిన విద్యుత్‌శాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా ఛైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్ర కళా దీప్తి, డిఈ జి.ప్రసాద్, డిఈఈ జి.వి.ఎల్.ఎన్.శ్రీనివాస్, ఏఈలు పి.ఎస్.వి.ప్రసాద్, సునీల్ కుమార్, జి.సత్యనారాయణ, కన్స్ట్రక్షన్ డిఈ డేవిడ్, ఏడీఈ ఉషారాణి, రిటైర్డ్ ఏఈ నెక్కంటి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వాసుపల్లి కృష్ణ, ధనలక్ష్మి, కోనాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రొఫెసర్ కె రామ్మోహనరావు**
**- ఆదిత్య డిగ్రీ కళాశాలలో "ఉన్నత విద్యలో సంస్కరణలు**
**- యువత సాధికారత" పై సదస్సు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో "ఉన్నత విద్యలో సంస్కరణలు - యువత సాధికారత"పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిల్ నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉన్నత విద్యను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్చడంలో అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన మరియు ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి గొప్ప కృషి చేస్తుందని, విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉన్నతి విద్యా మండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ కె రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులలో విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వ్యవస్థాపకత మరియు సమాజ సేవను అభివృద్ధి చేయడానికి, అధునాతన సాంకేతికతలలో భవిష్యత్తు నైపుణ్యాల కోసం వారిని సిద్ధం చేయడానికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని అన్నారు. ఉన్నత విద్య కై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఉన్నత విద్యకు సంబంధించి, పరిశోధనలకు సంబంధించి విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులు నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి డాక్టర్ జి.వి.ఆర్ ప్రసాద రాజు మాట్లాడుతూ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, ప్రొఫెసర్ రామ్మోహన్ రావు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లు గా బాధ్యతలు చేపట్టిన నుండి ఉన్నత విద్యలో అనేక మార్పులు తీసుకొచ్చారని, అందుకు ప్రభుత్వ పథకాలు తోడయ్యాయి అని, విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెన అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చేసిన మార్పుల వలన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు, షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులు, లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులు వంటి వాటి వలన ఆదిత్య డిగ్రీ కళాశాల నాక్ ఏ ప్లస్ ప్లస్ ర్యాంకు సాధించడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. విద్యార్థుల చదువుకు జగనన్న వసతి దీవెన,విద్యా దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ సదస్సును ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించినందుకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డికి ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తేజేశ్వర రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం







**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నబాబు**
**- వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ**

**కాకినాడరూరల్,మేజర్‌న్యూస్:** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక జేఎన్‌టీయు సమీపంలోని శాలరీడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రాంగణంలో సోమవారం వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. కార్పొరేషన్ పరిధిలోని రూరల్ డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు రూ.22,99,37,121ల మెగా చెక్‌ను ఎమ్మెల్యే కన్నబాబు విడుదల చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్‌పీలు క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి సాధించనప్పుడే సమాజ ప్రగతి సాధ్యమని, అందువల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ ఒక్క పథకాన్ని మహిళలపేరుతోనే కొనసాగిస్తుందన్నారు.కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంటరావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 1,2,3 రూరల్ డివిజన్లకు సంబంధించి ఆసరా నిధుల లబ్ధిని మహిళలు అందుకోబోతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను అందుకున్న మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మల మడక నాగమణి, జడ్పీటీసీ నురుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

**- కార్పొరేషన్ కమిషనర్ జే.వెంకటరావు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యకూ నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జగనన్నకు చెబుదాంలో భాగంగా సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు కమిషనర్ సి.హెచ్. నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులతో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించి డయల్ యువర్ కమిషనర్‌కు 9, స్పందనకు 4 దరఖాస్తులు అందజేశారు. ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె.వెంకటరావు అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థికపరమైన, న్యాయపరమైన అంశాలు మినహా ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించిన తర్వాత ఆ సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు కూడా తెలియజేయాలని కమిషనర్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాలలో కూడా తమ దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, డిసిపి హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏవో శిరీష్, పలువురు సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

## బ్యాంకుపేటలో జనసేన 'మేము సిద్ధం' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో బ్యాంకుపేట ప్రాంతంలో సిటీ కార్యదర్శి ముత్యాల దుర్గాప్రసాద్ మరియు సాయి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం దళితుల సంక్షేమ పథకాలని తీసేసిన జగన్‌పై వై.సి.పి. ప్రభుత్వంపై యుద్ధానికి మేము సిద్ధమే అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిద్ధం అని అంటూ సభలు నిర్వహిస్తున్నాడనీ సిగ్గులేదా 27 దళితులు పథకాలు ఆపేసినందుకు అని ప్రశ్నించారు. దళితుల జీవితాలలో వెలుగు తెస్తా అని హామీలు, వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి, వారిపైనే ఎస్.సి ఎస్.టి కేసులు పెట్టి హింసిస్తున్నందుకు నిన్ను మళ్ళీ నెగ్గించాలా అని ఎత్తిపొడిచారు. దళితుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చెయకుండా వంచించాడు ఈ జగన్మోహన్ రెడ్డి అని దుయ్యబట్టారు. కాకినాడలోను, రాష్ట్రంలోను వై.సి.పి. ని ఇంటికి పంపేందుకు మేము సిద్ధం అని నినందించారు.ఈ కార్యక్రమంలో దార్ల ప్రవీణ, పోలవరపు రవి, పి. రాజేష్, దుర్గా శివకుమారి, దేవి, సాయి లక్ష్మి, మాధవి, దారపు శిరీష, బట్టు లీల మరియు జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



కాకినాడరూరల్,మేజర్‌న్యూస్ : వైఎస్సార్ ఆసరా లబ్దిదారులకు డ్వాక్రా రుణమాఫీ నగదును విడుదల చేసిన సందర్భంగా డ్వాక్రా మహిళలు, మహిళా నాయకులు తదితరులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో జెఎన్టీయుకె ఎదురుగా "సేలరీడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రౌండ్ నందు కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల మునిసిపల్ వార్డులు అనగా 1,2,3 మరియు కాకినాడ రూరల్ మండలం లోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు 4వ విడత డ్వాక్రా రుణమాఫీ నగదును అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ మరియు ఏపీ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొనడం జరిగినది.

## పోలింగ్ స్టేషన్లు సందర్శించిన ఈఆర్ఓ

**– మౌలిక వసతుల పరిశీలన**



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు సోమవారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. గాంధీనగర్, ప్రతాప్‌నగర్, శ్రీరామ్‌నగర్, గుడారిగుంట, శంతనపురి కాలనీ ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లలో కనీస మౌలిక వసతులు ఉన్నాయో లేదో పరిశీలించారు. మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్, ర్యాంప్ వంటి సౌకర్యాల పై ఆరా తీశారు. మౌలిక సదుపాయాల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఈఆర్ఓ వెంకటరావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూపర్వైజర్లు, బిఎల్ఓలు ఉన్నారు.

# ఐటీడీఏ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా



రంపచోడవరం, మేజర్ న్యూస్ : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ అండ్ ఆధార్ కన్స్ట్రక్షన్ యూనియన్ నాయకులు చెక్కా రాజ్ కుమార్ మాట్లాడుతూ చనిపోయినా, ప్రసవమైనా, వివాహాలు చేసుకున్నా భవన నిర్మాణ కార్మికులకు గతంలో మాదిరిగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అలాగే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు అండగా ఉందనే నమ్మకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒమ్ము చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికులెవరికీ సంక్షేమ పథకాలు అమలు చేయవద్దని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే 1214 మెమో ఇప్పిం చారన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదం జరిగి చనిపోయినా, వయోభారంతో చనిపోయినా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు గతంలో వచ్చేవన్నారు. ప్రసవించిన భవన నిర్మాణ కార్మికురాలికి, కార్మికుని కుమార్తెకు రూ.50 వేలు వచ్చేవని, మహిళా కార్మికులు వివాహం చేసుకున్నా, కార్మికుని కుమార్తెకు వివాహం చేసినా రూ.50 వేలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా కానుకగా వచ్చేవని, రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం ఫలితంగా ఇవేవి నేడు అమలు కావడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఆయా పథకాలకు తోడు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కి, రాష్ట్ర ఖజానాకు గాని ఒక్క రూపాయి ఖర్చు లేదన్నారు. సంక్షేమ పథకాలకు ఇచ్చే నిధులన్నీ రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నిధులేనని, ఈ నిధులన్నీ భవన నిర్మాణదారులు, సివిల్ వర్క్స్ చేసే కాంట్రాక్టర్లు చెల్లించిన కార్మిక సంక్షేమ నిధికి జమ చేసిన డబ్బులే ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులకు చెందాల్సిన డబ్బులు రాష్ట్ర ముఖ్యమంత్రి దుర్బుద్ధితో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు తరలించారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సొమ్మును భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెద్ద స్థాయి అధికారులు, ప్రభుత్వ పెద్దలు, కార్మికశాఖా మంత్రి అసలు భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేకంగా పథకాలు ఎందుకు? అవసరం లేదని బుకాయిస్తున్నారని విమర్శిం చారు. రాష్ట్రంలో జగనన్న నవరత్న పథకాల్లో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్నాం కదా! ప్రత్యేకంగా ఇవ్వాల్సిన అవసరం లేదనేది వీరి వాదనగా ఉందన్నారు. వై.ఎస్.ఆర్. బీమా ద్వారా ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షల బీమా ఇస్తున్నారని, భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో చనిపోతే వై.ఎస్.ఆర్. బీమా ద్వారా ఇస్తున్నాం కదా అనేది ప్రభుత్వ వాదనని, కానీ వై.ఎస్.ఆర్. బీమాలో చనిపోయిన వారు కుటుంబ పెద్ద అయితే మాత్రమే ఇస్తున్నారన్నారు. కానీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకుంటే వారు కుటుంబ పెద్ద అయినా కాకపోయినా కుటుంబ సభ్యుడైనా వెల్ఫేర్‌బోర్డు ద్వారా రూ.5 లక్షలు అందేవన్నారు. సహజ మరణం పాల్కైన కార్మికులకు రూ.2 లక్షలు ఇచ్చేవారని, ఏ రకంగా చనిపోయినా భవన నిర్మాణ కార్మికులకు మట్టి ఖర్చులు నిమిత్తం రూ.20 వేలు బోర్డు ద్వారా అందేవని, నవరత్న పథకాల్లో భాగంగా అమలవుతున్న పెళ్లి కానుకకు అర్హత సాధించాలంటే పెళ్లి కుమార్తె 10వ తరగతి చదివి ఉండాలని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా ఇచ్చిన పెళ్లి కానుకకు చదువు కొలమానంగా లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఏ కులానికి సంబంధించిన వారైనా భవన నిర్మాణ కార్మికులు, కార్మికుల కుటుంబాల్లో కుమార్తె అయితే చాలన్నారు. ఇదే రకంగా నవరత్న పథకాలు పేరు చెప్పి అందరికీ ఇస్తున్నాం కదా అనే బుకాయింపుతో భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర ద్రోహం వైసీపీ ప్రభుత్వం చేస్తోందని, పొరుగున ఉన్న తెలంగాణా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతో సహా దేశంలో అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్‌బోర్డు ద్వారానే అమలు చేస్తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సంక్షేమబోర్డు చట్టానికి తూట్లు పొడవాలని, సంక్షేమ చట్టాన్నే రద్దు చేయాలని మోడీ కోరికతో ఉన్నారన్నారు. రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నారని, దీన్ని అందరూ కలసి కట్టుగా ఎదురించి పోరాడాలని పిలుపునిచ్చారు. రానున్నది ఎన్నికల కాలం కాబట్టి ఈ చట్టాన్ని రద్దు చేయాలనే బీజేపీకి, పథకాలు ఆపేసిన జగనన్నకు వచ్చే ఎన్నికల్లో దిమ్మతిరిగే సమాధానం భవన నిర్మాణ కార్మికులు చెప్పాలన్నారు. గతంలో అమలైన పథకాలు మాత్రమే కాకుండా పక్క రాష్ట్రాల్లో అమలవుతున్నట్లుగా కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు, భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాలకు బోర్డు ద్వారా లోన్లు, కార్మికుల కుటుంబాల్లో మహిళలకు కుట్టు మిషన్లు తదితర కొత్త సంక్షేమ పథకాలు పోరాడిసాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, భవన నిర్మాణ సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు పి.రామరాజు,జిల్లా నాయకులు జి.సురేష్, ఎల్.పెద్దకాపు, ఆదినారా యణ, శ్రీను, సూరిబాబు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా కట్టడాలు - చోద్యం చూస్తున్న అధికారులు



పి.గన్నవరం, మేజర్ న్యూస్ : పి.గన్నవరం మండలం పోతవరం గ్రామం కోరుకొండ వారిపేటలో ప్రమాదకరంగా కట్టడం జరుగు తున్నది. రోడ్ ప్రక్కన రేకుల షెడ్ నిర్మాణం జరుగుతున్నా పంచాయతీ అధికారులు గాని విద్యుత్ అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. పంచాయితీ అధికారులని అడుగగా మాకు తెలియదు, మేము చూడలేదని చెబుతున్నారు. అలాగే విద్యుత్ అధికారులని వివరణ అడుగగా షెడ్ నిర్మించే వరకు మాకు కూడా తెలియదని షెడ్ అతనికి నోటీసులు పంపిస్తున్నామని తెలిపారు. షెడ్ నిర్మించేటప్పుడు విద్యుత్ వైర్లు తగిలితే జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు భాధ్యులు.ఏది ఏమైనప్పటికీ షెడ్ పై వేసిన రేకులకు సెంటీమీటర్ ల ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండగా ఏ అధికారి మాకు తెలియదు అనడం కొసమెరుపు.

## అగ్నిప్రమాద భాదితులకు అండగా జనసేన

**– పి.గన్నవరం జనసేన పార్టీ ఇంచార్జ్ గిడ్డి సత్యనారాయణ**



పి.గన్నవరం, మేజర్ న్యూస్ : పి.గన్నవరం మండలం పోతవరం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్నిప్రమాదంలో పెద్దిమేని మంగాయమ్మ, పెద్దిమేని శ్రీనివాసరావు లకు చెందిన ఇల్లు కాలి బూడిద అయ్యాయి. ఈప్రమాదం షార్ట్ సర్క్యూట్ వలన జరిగినదని తెల్లవారు జామున జరగడంతో ఇల్లు, ఇంట్లోగల బట్టలు, వంట సామాగ్రి మొత్తం కాలిపోయాయని కట్టుబట్టలతో మిగిలామని భాదితులు వాపోయారు. ఈ ప్రమాదంలో ఒక లక్ష రూపాయల నగదు, రెండు కాసుల బంగారం, రెండు బీరువాలు మరియు లక్ష రూపాయల విలువైన ప్లంబింగ్ మెషిన్ అగ్నికి ఆహుతి అయాయి. ఈ విషయం తెలిసిన వెంటనే సోమవారం ఉదయం పదకొండు గంటల సమయంలో జనసేన పార్టీ పి.గన్నవరం ఇంచార్జ్ గిడ్డి సత్యనారాయణ అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి భాదితులను కలుసుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని తనవంతు సహాయంగా ఒక్కొక్కరికి పదివేలురూపాయలు మరియు ఇరువై ఐదు కేజీల బియ్యం చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం ఎం.పి.పి. నాగలక్ష్మి, జనసేన మండల ప్రెసిడెంట్ ఎస్.సత్య నారాయణ ,టి.వెంకటేష్,డి.రాంబాబు, టి.శ్రీనివాస్, బి.తాతాజీ మరియు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ చైర్మన్‌గా కేత శ్రీనివాసరావు



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్: బిసి, ఎస్సీ, ఎస్ టి, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ గా రాజవొమ్మంగి కి చెందిన కేత శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు( బీఎంపీ వైద్యులు) స్థానిక విలేకరులతో మాట్లాడుతూవిశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ టి ఎల్ ఎన్ సభ మందిరంలో మంగారపు వెంకటరామయ్య అధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగిందని నూతన కార్యవర్గానికి ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్టర్ జేమ్స్ స్టీవెన్ నియామక పత్రాలు అందజేశారన్నారు.రాష్ట్రంలో అనేక ఉద్యోగ సంఘాలు ఉన్నప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్ టి మైనారిటీ ఎంప్లాయర్స్ టీచర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. జేఏసీతొలుత చిన్నగా ప్రారంభించిన అనతి కాలంలో అన్ని డిపార్ట్మెంట్లు నందు సభ్యులను కలిగి ఉండడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక బీఎంపీ వైద్యులు అభినందించారు.

## జనసేన పార్టీలో భారీగా చేరికలు



పి.గన్నవరం, మేజర్ న్యూస్ : పి.గన్నవరం మండలంలోని ముంగండపాలెం గ్రామంలో వైకాపాకు చెందిన పెరాబత్తుల లక్ష్మీనారాయణ, మట్టపర్తి శ్రీనివాసరావుతో సహా 60 మంది కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు ముంగండపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి సత్యనారాయణ వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల శ్రీ వెంకట సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నియోజ కవర్గ ఇన్చార్జి గిడ్డి సత్యనారాయణ, శిరిడినీడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ జనసేన పార్టీకి అన్ని వర్గాలలోని ప్రజల నుండి రోజురోజుకు మద్దతు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం



పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం బిజెపి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం... కార్యక్రమం నిర్వహించారు. పిఠాపురం రూరల్ ప్రధాన కార్యదర్శి దువ్వా గంగాధర్ ఆధ్వర్యంలో రాపర్తి గ్రామంలో కాకినాడ జిల్లా ఇంచార్జ్ రావూరు సుధా పాల్గొన్నారు. గ్రామంలో పార్టీ జెండా ఎగరవేయడం, వాల్ రైటింగ్ రాయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ రావూరు సుధా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ జిల్లా కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పిఠాపురం రూరల్ అధ్యక్షులుపిల్లా ముత్యాలరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ధోనె అచ్యుతరామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అడబాల శ్రీనివాస్, వెన్న సుబ్బారావు, కె. రాజ్ కుమార్, కరణం గంగ భవాని తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్దేశకులు రోటరి గోల్డ్ సభ్యులు - డా॥ రావు



**– ఘనంగా నిర్వహించిన మాఘ మధురిమలు**
**– అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

కాకినాడ, మేజర్ న్యూస్ : రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ మరియు శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో సపరివార సకుటుంబ సమ్మేళనం మాఘ మధురిమలు ఘనంగా నిర్వహించబడింది. స్థానిక జ్యోతుల వెంకటేశ్వరరావు మామిడితోటలో సుమారు ఆరు గంటల పాటు ఈ వేడుకలు జరిగాయి. తొలుత క్లబ్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది నరహరిశెట్టి రవికృష్ణ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం కార్యదర్శి జె.చంద్రరావు (చందు) దంపతులు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. ఎస్.వి.ఎస్.రావు మాట్లాడుతూ రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ సభ్యులు సమాజంలో వినూత్న సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు నిస్వార్థ సేవకు శ్రీకారం చుట్టారని అన్నారు. సమాజంలో ఉన్నత స్థానంలోను మరియు ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులు ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉండడం ఒక వరంగా ప్రస్తావిస్తూ వారి సంఘటిత సేవల ద్వారా సమాజానికి ఎన్నో అరుదైన శాశ్వతమైన సేవలను అందించి మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. గోల్డెన్ జూబ్లి క్లబ్ రోటరి డిస్ట్రిక్ట్‌లోనే ప్రత్యేక గుర్తింపు పొందడమే కాక క్లబ్ చేస్తున్న సేవలు ఇతర క్లబ్‌లతో పాటు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలబడింది అనడంలో సందేహం లేదన్నారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత జి.శ్యామ్ మరియు చేయూత సేవాసంస్థ వ్యవస్థాపకులు చేయూత రవి నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రయోజనమే కాకవేలాది కుటుంబాలకు తోడ్పాటుగా ఉందని అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల పోలీస్ మరియు రెవెన్యూ పోటీ పరీక్షలలో అధిక సంఖ్యలో ఉత్తీర్ణతా శాతం కైవసం చేసుకుని రికార్డ్ సృష్టించిన జి.శ్యామ్ దంపతులను ఘనంగా సత్కరించారు.రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి కుటుంబ సమ్మేళనాలకు సభ్యుల సహకారం అందించడం ముదావహమని జి.శ్యామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డా. టి.వి.బాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, ప్రోగ్రామ్ కన్వీనర్లు మాచారెడ్డి, చిరంజీవిరెడ్డి, బచ్చు రాజేష్, తాళ్ళూరి శ్రీనివాసరాజు, డి.ఎ.ఎన్.ప్రసాదవర్మ, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డా.రామకృష్ణ, కార్యదర్శి చార్మినార్ వర్మ, ఓల్డేజ్ హోం చైర్మన్ ధనసాగర్ ప్రసాద్, కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాబోలు చినపున్నయ్య, వెత్సా ఆనంద్, క్లబ్ కోశాధికారి పవన్, టేకుమూడి సూర్యనారాయణ, ఉషారాణి, డా.గొడవర్తి సత్యమూర్తి, డా.పరశురామ్‌తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో జనసేనకు ఏమైంది...?

- స్థానికత అంశంతో సతమతమవుతున్న తంగెళ్ల
- దళిత యువకులపై ఫిర్యాదులతో అబాసు పాలైన జనసేన
- స్థానిక నాయకులతో తంగెళ్ళకు కానరాని సఖ్యత
- వారానికి ఒక్కసారైనా జనసేన ఇంచార్జి కనిపిస్తారా...?
- మరొక్కసారి ఇంచార్జి మార్పు తప్పదా...?

పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురంలో జనసేనకు ఏమైంది...? అసలు జనసేనలో ఏం జరుగుతుంది...? వారంలో ఒక్కసారైనా మా ఇన్చార్జ్ కనిపిస్తారా...? మరొక్కసారి పిఠాపురం జనసేన ఇంచార్జి మార్పు తప్పదా.... దళిత యువకులపై ఫిర్యాధులతో పిఠాపురం జనసేన పార్టీ అబాసు పాలయ్యిందా...? అన్న ప్రశ్నలు ఇప్పుడు పిఠాపురం ప్రజల మదిని తొలిచేస్తున్నాయి. పిఠాపురంలో బలంగా ఉందనుకుంటే ఇలా అయ్యిందేంటి అన్న భావన పిఠాపురం జన సైనికుల నుండి వినిపిస్తున్న మాట. కాపు సామాజిక వర్గం బలంగా వున్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన చాలా బలంగా ఉందనే చెప్పాలి. ఇక్కడ పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ కోసం పని చేసే సీనియర్ నాయకులు పిల్లా శ్రీధర్, చల్లా లక్ష్మి, జ్యోతుల శ్రీనివాస్, మురాలశెట్టి వంటి నాయకులు ఎంతోమంది వున్నారు. వీరంతా తమదైన శైలిలో పవన్ ఆశయాలను, సిద్ధాంతాలను వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకు వెళుతున్నారు. వీరి సారథ్యంలో పిఠాపురంలో జనసేన చాలా బలంగా మారిందని చెప్పవచ్చు. కానీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జిగా తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ ను ఇక్కడ ఇంచార్జి గా ప్రకటించిన అనంతరం పరిస్థితులు పూర్తిగా మారి పోయాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ ఇంచార్జి తమకు ఎప్పుడు కనిపిస్తారో కూడా తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ స్థానికత అంశంతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం పిఠాపురం నియోజవర్గంలో పొత్తులో భాగంగా సీటు కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలని, అది కూడా స్థానికులకే ఇవ్వాలన్న వాదన బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో జనసేన కేడర్ మరింత అయోమయానికి గురవుతుంది. స్థానిక అంశాన్ని ఎదుర్కొనేందుకు తంగేళ్ల శ్రీనివాస్ త్వరలోనే పిఠాపురంలో ఇల్లు అద్దెకి తీసుకుని ఇక్కడే నివాసం ఉంటారని, అందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది.ఎన్నికలు సమీపిస్తున్న వేళ అదొక్కటే సరిపోదని, నియోజకవర్గంలో జనసేనకు వున్న పునాదిని నిలుపుకోవాలంటే ఇక్కడ జనసేన కోసం, పవన్ కళ్యాణ్ కోసం ఎంతో కాలంగా శ్రమిస్తున్న సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకుని వెళ్ళాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని నియోజకవర్గాల కంటే పిఠాపురంలో జనసేన బలంగా ఉందనుకుంటే ఇలా జరుగుతుందేంటి అని జనసైనికులు ఆవేదనకు గురవుతున్నారు. జనసేనకు గత వైభవం మళ్లీ వస్తుందా... అంటే అది తంగెళ్ళ ఇంచార్జి గా ఉండగా సాధ్య పడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల స్థానిక జనసేన నాయకులు దళిత యువకుల పై చేసిన రెక్కీ, హత్యాయత్నం ఆరోపణలు జనసేనను మరింత ఇరకాటంలో పడేశాయి. ఈ విషయంలో దళిత సామాజిక వర్గం నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యింది. పిఠాపురం జనసేనలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో... మరొక్కసారి ఇంచార్జిని మార్పు చేసి, స్థానిక నాయకులకు ఇంచార్జి బాధ్యతలు ఇచ్చే అవకాశం లేకపోలేదన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

## ప్రజారోగ్యం కోసం సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కాకినాడ రూరల్ ప్రాంతంలోని వాకలపుడి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రజలకు బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య పరీక్షలను ఫౌండేషన్ వైద్యులు ఉచితం చేశారు.

అనంతరం వారికి ఆరోగ్య పరిరక్షణ కోసం పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పారు, అందుకే మన జిల్లా ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సానా సతీష్ బాబు సారథ్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజల నుంచి లభిస్తున్న అనూహ్య స్పందన తమకు మరింత ప్రోత్సాహం ఇస్తుందని, వారికి వైద్య శిబిరాలు ఉపయోగ పడటం ఆనందాన్ని కలిగిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## రామచంద్రపురం పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం: 24/23-ఇ1 తేది. 12.02.2024

ఇ ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

రామచంద్రపురం పురపాలక సంఘం నందు పురపాలక సంఘ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు ఎమ్.పి.లాడ్స్ నిధులు నుండి 26 పనులు గాను రూ.185.65 లక్షల అంచనాలతో టెండర్లు పిలువబడినవి.

టెండర్ బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ :
12-02-2024 ఉదయం గం॥ 10.00 ల నుండి.

టెండర్ బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ :
20-02-2024 సాయంత్రం గం॥ 4.00 వరకు.

మిగిలిన వివరములు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం// బి.శ్రీనివాసులు
కమీషనరు,
రామచంద్రపురం మున్సిపాలిటీ

## సామర్లకోట పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం: 562/2023-ఇ1 తేది. 12.02.2024

షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘమునకు సంబంధించి 2024-2025 మరియు 2025-26 సంవత్సరములకు (మార్చి, 2024 నుండి మార్చి, 2026 వరకు) సాధారణ నిధులు మరియు ప్రభుత్వము వారు విడుదల చేయబడు వివిధ గ్రాంట్లు ద్వారా జరుగు అభివృద్ధి పనులు (సివిల్) నాణ్యతను నిర్ధారించుటకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీల నుండి ది.17-02-2024వ తేదీ సాయంత్రం గం॥ 4.00 లకు సీల్డు టెండర్లు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గం॥ 4.30 ని॥ లకు అప్పటికి హాజరయిన టెండరుదారుల సమక్షంలో కమీషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన వేరే అధికారి వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండరు తేదీ వాయిదా వేయుటకు రద్దు పరచుటకు కాయపర్చుటకు మున్సిపల్ కౌన్సిలుకు పూర్తి అధికారము కలదు. మిగిలిన వివరములు కార్యాలయము పని దినములలో తెలుసుకొనవలెను.

| వ.నెం. | పని పేరు | అంచనాలు చేయబడిన క్వాలిటీ కంట్రోల్ ఫీజు విలువ | ధరావత్తు రూ॥ | షెడ్యూలు ఖరీదు రూ॥ |
|---|---|---|---|---|
| 1. | పట్టణము నందు రూ.1,00,000/-లు పైబడి జరుగు అభివృద్ధి పనులకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీ వారు పనుల నాణ్యతను పర్యవేక్షణ చేసి సర్టిఫికెట్ ఇచ్చుటకు | 7,00,000=00 | 17,500=00 | 1,750=00 |

1. టెండరు షెడ్యూలు కొరకు రుసుము చెల్లించుటకు ఆఖరు తేదీ : 15-02-2024
2. టెండరు ఇ.ఎమ్.డి. చెల్లించుటకు ఆఖరు తేదీ : 16-02-2024
3. టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ : 17-02-2024 (ఉదయం గం॥ 11.00 లకు)
4. టెండరు తెరువబడు తేదీ : 17-02-2024 (సాయంత్రం గం॥ 4.30 లకు)

కమీషనరు
సామర్లకోట పురపాలక సంఘం

సూర్య
తూర్పుగోదావరి
మంగళవారం
13 ఫిబ్రవరి 2024


## కానూరు అగ్రహారంలో ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామం ఇనాం గ్రామం అయి ఉన్నందున గ్రామ భూ రికార్డులను తయారు చేయు నిమిత్తం పెరవలి మండల రెవెన్యూ అధికారులు బృందం ఫిబ్రవరి 12వ తేదీ సోమవారం ఎంజాయ్మెంట్ సర్వే జరిపి లబ్ధిదారులను భూమి మీద అనుభవంలో ఉన్న రైతుల వివరములను సేకరించారు. సదరు వివరములను గ్రామ సభ ద్వారా గ్రామస్తులకు మరియు రైతులకు తెలియజేయు నిమిత్తం కానూరు అగ్రహారం సచివాలయం వద్ద పెరవలి తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ కె సన్నీ బాబు మండల సర్వేయర్ కె గోపాలకృష్ణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పులిదిండి పావని వీఆర్వోలు పంచాయితీ సిబ్బంది కానూరు అగ్రహారం సర్పంచ్ దాసం వెంకన్న వైసిపి నాయకులు దాసం బాపన్న రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం రాజానగరం మండలం ముక్కినాడ కు చెందిన అనదాసు సాయిరామ్, స్వాతి మణి దంపతులు రూ.60,500లు విరాళం అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిసి భూపతి రాజు కిశోర్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.

# చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం సుభిక్షం



**– వైసీపీని వీడి టిడిపిలో పలువురు చేరిక**
**– టిడిపి కండువాతో సాదరంగా ఆహ్వానించిన కొండబాబు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** చంద్రబాబు పాలనతోనే ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, జగన్ రెడ్డి అరాచక పాలనతో నేడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అభాసుపాలైందని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబు పవన్ కళ్యాణ్ సారధ్యంలో తెలుగుదేశం జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురం 20 వ డివిజన్ ఎన్టీఆర్ స్కూల్ వద్ద సోమవారం జయహో బీ.సీ. సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 వ డివిజన్ వైసిపి నాయకులు ఆకుల దుర్గాప్రసాద్ (జాన్ వెస్లీ) తన అనుచర వర్గం 200 మందితో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి కొండబాబు పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు.



ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే, జగన్ రెడ్డి తన అరాచకాన్ని విధ్వంసాన్ని అభివృద్ధి చేసుకున్నాడని, చంద్రబాబు సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే జగన్ రెడ్డి నాలుగేళ్లన్నర పాలనలో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నాడని, వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు మహిళలపై దాడులు అధికమయ్యాయని, స్వర్ణాంధ్రగా కీర్తి గడించిన ఆంధ్ర రాష్ట్రాన్ని జగన్ రెడ్డి గంజాయి కేంద్రంగా మార్చేసాడని, వైసీపీ పాలనలో దగాపడ్డ ఆంధ్రప్రదేశ్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ప్రతిఒక్కరిపై ఉందని, వైసీపీ అభ్యర్థులను జగన్ మారిస్తే జగన్ రెడ్డిని మార్చేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని, జగన్ రెడ్డి అవినీతి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తేదేపా జనసేన టిడిపి ప్రభుత్వం రాబోతుందని, బీ.సీ.లకు న్యాయం జరగాలి అంటే ఒక్క చంద్రబాబు తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, కొల్లిబోయిన శ్రీనివాస్, వనపత్రి బద్రి, డివిజన్ నాయకులు గొరుసు వెంకట దుర్గారావు, బిసీ సెల్ అధ్యక్షులు ఒమ్మి బాలాజీ, గదుల సాయిబాబా, దండిప్రోలు నాగబాబు, ఎ.వి.డి. మెంటారావు, పలివెల రవి, తుమ్మల రమేష్, గుత్తుల రమణ, పసగడుగుల శేషగిరిరావు, మేడిశెట్టి చిన్ని, ఎస్.కె. రహీమ్, తుమ్మల సునీత, గుజ్జు బాబు, పినపోతు రాము, ప్రకాష్ గౌడ్, మల్లాడి ప్రసాద్, పిర్ల లక్ష్మీ ప్రసన్న, మల్లాడి అంజి, రవి, సంఘాని నాగేశ్వరరావు, ఆరదాడి శివ, పంతాడి రాజు, అంగాడి దుర్గారావు, ఆకుల చంద్రశేఖర్, కొపనాతి రవి, పాలెపు నాగేశ్వరరావు, కాలాడి ఏడికొండలు, దేవానందం, శేరు శ్రీను, చింతపల్లి తాతారావు, శ్రీను, కోనాడ ప్రకాష్, బలగం పరుశురాం, పూడి శ్రీను, చంద్రరావు, గ్రంధి కాశీ రత్నం, అర్బన్ బాషా, పాలిక నాని, తెప్పల రామలింగేశ్వరరావు, ఇమామ్ సాహెబ్, లంకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై అధికారులకు వర్క్‌షాప్



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు కొవ్వూరు డి.యస్.పి కె.సి. హెచ్. రామారావు పర్యవేక్షణలో దేవరపల్లి మండలంలోని బి హెచ్ యస్ ఆర్ కళాశాలలో కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని హోంగార్డు నుండి ఏఎస్ఐ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పోలీసు అధికారులు పోలింగ్ ముందు రోజున, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఎలా విధులు నిర్వహించాలి అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. వర్క్ షాప్ లో పోలీస్ సిబ్బంది కి ఎలక్షన్ కోడ్ వచ్చినప్పటి నుండి వారు చేయ వలిసిన విధులు, పోలీస్ వారు ఏమేమి పనులు చేయాలి, ఏ పను లు చేయకూడదు అనే వాటి గురించి తేలియజేస్తూ పోలీస్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించినారు. రాజమాహేంద్రవరం నార్త్ జోన్ డి.యస్.పి కె..శ్రీనివాసు, దేవరపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ, దవళేశ్వరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జీ..వినయ్ మోహన్, సి.ఐ. అనుసూరి శ్రీనివాసరావు, దేవరపల్లి ఎస్ ఐ కె. శ్రీహరిరావు, గోపాలపురం ఎస్ ఐ సతీష్ వర్క్ షాప్‌లో పాల్గొన్న సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

## గురుకుల పాఠశాలలో పుడ్ పాయిజనింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి

**– ప్రిన్సిపాల్ నాగేశ్వరరావును సస్పెండ్ చేయాలి**
**– పీడీఎస్‌యు నాయకులు సిద్ధూ డిమాండ్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ద్రాక్షారామ (అదివారపుపేట) అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుడ్ పాయిజనింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలని, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రిన్సిపాల్ ఎన్. వి. నాగేశ్వరరావు ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యు నాయకులు బి.సిద్ధూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామచంద్రపురం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ద్రాక్షారామ (అదివారపుపేట) అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుడ్ పాయిజనింగ్‌తో రక్తపు విరోచనాలు, విరోచనాలు, వాంతులుతో ఆసుపత్రిలో చేరిన అయిన విద్యార్థులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిన్న ఆదివారం మధ్యాహ్నం పెట్టిన చికెన్ బిర్యానీ కలుషితమయిందని. నిన్న రాత్రి సుమారు 52 మంది వరకు ఆహారం కలుషిత మవడం వల్ల విరోచనాలు, వాంతులు, రక్తపు విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారని, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సుమారు 8 మంది అస్వస్థతకు గురైన విద్యార్థులు ఉన్నారని అన్నారు. వీరందరికి మెరుగైన వైద్యం సదుపాయాలు కల్పించాలని, దీనికి బాధ్యత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.నాగేశ్వరరావు వహించాలని, ప్రభుత్వం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వి. నాగేశ్వరరావు ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఉన్న విద్యార్థులతోపాటు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉన్న 52 మంది విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం వెంటనే నాణ్యత కలిగిన ఆహారం విద్యార్థులకు అందించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వి.భీమా శంకర్,చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుసర్ల శతజయంతి వేడుకలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పి.ఆర్.కాలేజీ ఫిజిక్స్ హెచ్ఓడి సుసర్ల శ్రీనివాసరావు శతజయంతి ఉత్సవాలను ఆయన కుమార్తె గోపిక ప్రసాద్, కుమారుడు చలపతిరావు లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సత్య ప్రమోదవనములో సోమవారం జరిగిన శత జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుండి బంధువులు, మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ దేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించగా, అధ్యాత్మికవేత్త డాక్టర్ యాతగిరి పరశురామ్ మాట్లాడుతూ సుసర్ల శ్రీనివాసరావు గొప్ప అధ్యాత్మికవేత్త అని అన్నారు. గ్రంథ రచనలతోపాటు ఆధ్యాత్మిక విషయాలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కీర్తించారు. ఆయన అల్లుడు పి.వి.ఆర్.కె. ప్రసాద్ సీనియర్ ఐఏఎస్ అధికారిగా ఉంటూ మామగారి ఆలోచనలకు అనుగుణంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మధ్వ మతంతోపాటు సమాజానికి ఎంతో సేవ చేశారని ప్రస్తావించారు. గురువుల పట్ల అపారమైన భక్తిభావం కలిగిన మామ అల్లుళ్ల చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కాకినాడ మధ్వసభ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆనాటి కార్యక్రమాలను వివరించారు. యాతగిరి కృష్ణమూర్తి ఆచార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలతోపాటు గ్రంథ రచనలు కూడా ప్రస్తావిస్తూ సుసర్ల శ్రీనివాసరావు మరియు ప్రసాద్ సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేనివని అన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన యాట్ల నాగేశ్వరావు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను రామచంద్రపురం నియోజకవర్గం మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురంలో ఆదివారం జరిగిన శంఖారావం సభకు ముందు ఆయనను మర్యాధ పూర్వకంగా కలిశారు. అనంతరం యాట్ల ఆయనతో మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో 95,000 కు పైగా బీసీ ఓట్లు ఉన్నాయని, అందులో మైనార్టీ బీసీ సంఘం ఓటు బ్యాంకు 49,000 వరకు ఉన్నదని, మా సంఘం యెక్క ఏకగ్రీవ తీర్మానం ఆమోదంతో మీ ముందుకు వచ్చానని, నియోజకవర్గంలో మిగిలిన సామాజికవర్గాలు మద్దతు కూడా నాకు ఉన్నదని, పైగా నేను స్థానికుడినని, మాది రాజకీయ కుటుంబం అని, తాను గత 12 సంవత్సరాలు నుండి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు, మా సంఘం యెక్క సహకారంతో ఎన్నో కార్యక్రమాలు చేశామని, కావున మా నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు సేవ చేసేందుకు రామచంద్రపురం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ తరుపున పోటీ చేసే అవకాశం నాకు కల్పించాలని కోరానని తెలిపారు. లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎం.పి.కింజారపు రామ్మోహన నాయుడు, ఇచ్చాపురం ఎమ్మెల్యే బిందాల అశోక్ పాల్గొన్నారు.

# ఐప్వా 30వ ఆవిర్భావ దినోత్సవం




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం 30 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో మహిళలు ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఎమ్మెల్యే లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు రాష్ట్ర కమిటీ సభ్యులు రాజ్యాల రత్నం అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జక్కంపూడి రాజు గిరిజన సంఘం కార్యదర్శి భాషా రాజమణి సంఘం మండల కమిటీ సభ్యురాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఏగుపాటి అర్జున్ రావు మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపన జరిగి 30 సంవత్సరాలు కావస్తుందని గడిచిన ఈ 30 సంవత్సరాల లో అనేక పోరాటాలు నిర్వహించిందని మహిళలకు రాజ్యసభలో, పార్లమెంట్ లో అసెంబ్లీలోని 33% రిజర్వేషన్ల కోసం అనే కార్యక్రమాలు చేసిందని దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తూనే ఉందని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళల ఆత్మ గౌరవం కోసం అనేక ఉద్యమాలను కొనసాగించిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాజాలరత్నం మాట్లాడుతూ మహిళ సాధికారత, హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామని వ్యవసాయ కార్మికులకు సరైన గుర్తింపు వేతనాలు లేవని ఏది ఏమైనా సరే మహిళల హక్కుల కోసం మేము ముందే నిలబడతామని ఆమె అన్నారు, మానకొండ మాట్లాడుతూ రాబోయే కాలంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఇప్పటికి కూడా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు సరైన చట్టాలు లేకుండా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సభలో దుమ్మలదేవి బి ఏగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ గ్రీవెన్స్‌లో వినతులు స్వీకారం

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో పలు సమస్యలపై అధికారులకు ప్రజలు వినతులు అందజేశారు.వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో స్పందన కార్యక్రమాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఏపీవో జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈ వారం 52 దరఖాస్తులు రావడం జరిగిందని, భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా రావడం జరిగిందని తెలిపారు. అడ్డతీగల మండలం పరిమితడక గ్రామంలోని సుమారు150 గిరిజనులు అటవీ హక్కుల చట్టం ద్వారా కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని నాగులపల్లి అర్జునుడు, సోముల కుశలం, కస్తూరి వీరరాజు అందజేశారు. అడ్డతీగల మండలం పనుకురాతిపాలెం నుండి పైడిపుట్ట గ్రామం వరకు నాలుగు కిలోమీటర్లు మెటల్ రోడ్డు కొంతమేర పనులు చేసి మధ్యలో పనులు ఆపివేయడం జరిగిందని, వెంటనే పనులు ప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని యం.చిన్నారెడ్డి, కె.లచ్చిరెడ్డి, పల్లాల జయరాజు వినతిపత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపుకు గురైన గిరిజన బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ల్యాండ్ టు ల్యాండ్ మంజూరు చేసి, భూమి చదును చేయించాలని దేవీపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన తాళ్లూరి నడిపిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అడ్డతీగల మండలం రావులపాడు గ్రామంలో పది ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకొనుటకు సబ్సిడీపై పవర్ వీడర్ మంజూరు చేయాలని దాని శివకుమార్ కోరారు. వై.రామవరం మండలంలో కానివాడ వరకు రహదారి పనులు పూర్తిచేయాలని కానివాడ సర్పంచ్ పల్లాల శిల్పా రాణి కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు గొల్లపాలెం, కాజులూరు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** నేషనల్ హైవే రోడ్లను వెడల్పు చేయుటలో ఏపీ ట్రాన్స్కో వారి టవర్లు కొన్ని ప్రక్కకు జరుపుటకొరకు గొల్లపాలెం 132కేవీ సబ్ స్టేషన్ కు 220కేవీ కాకినాడ నుండి మొత్తం సప్లై ఆపవలసి ఉంటుంది. దీనికి సంబంధించి గొల్లపాలెం, కాజులూరు ఏరియాలలో 14వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వచ్చే అవకాశం ఉంది. కావున యావన్మంది ప్రజానీకం సహకరించవలసినదిగా మరియు తగు ఏర్పాట్లు చేసుకోవలసినదిగా ట్రాన్స్కో ఈఈ జొన్నాదుల రామారావు మరియు కాకినాడ ఆపరేషన్స్ ఈఈ జి.ప్రసాద్ తెలియచేశారు.

# 60 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** విద్య ప్రపంచంలో అత్యుత్తమైన సంపదని సామాజిక విశ్లేషకులు మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు అన్నారు. సోమవారం సంగాయగూడెం ప్రధాన ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులకు సత్తిరాజు నోటు పుస్తకాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సుంకవల్లి సత్తిరాజు మాట్లాడుతూ ఈ సంపద ద్వారా జ్ఞానం అలవడుతుందని, జ్ఞానం వలన దేశం అభివృద్ధి చెందుతుందని, ఇలాంటి జ్ఞానార్జనలో విలువలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. చిన్న వయసులోనే బాలబాలికల్లో సద్గుణాలు పెంచాలని, బాల్యదశ విద్య ,క్రమశిక్షణతో వికసించాలని, విద్య లేని వాడు మనిషి కాలేడని, విద్య నేర్చుకున్న వారిలో సంస్కారం లోపిస్తే మూర్ఖులుగా తయారవుతారని పేర్కొన్నారు. వర్తమాన ప్రపంచంలో స్వార్ధ చింతన, అవినీతి, అమానుషత్వ పోకడలు పెరిగి పోయాయని, దాని ఫలితమే విలువల విధ్వంసమని సుంకవల్లి సత్తిరాజు పేర్కొన్నారు. ఈ ప్రపంచాన్ని కేవలం దాన ధర్మాల వలన మార్చలేమని, మోటివేషన్ వలనే నూతన ప్రపంచం సాధ్యమవుతుందని, అబ్రహాం లింకన్, మార్టిన్ లూథర్ కింగ్, స్వామి వివేకానంద అబ్దుల్ కలాం వంటి వారు తమ రచనలతో ఎంతగానే ప్రభావితం చేసారని, మనం నడిచే ప్రతీ అడుగులో మోటివేషన్ ఉండాలని, మాటల్లోనే కాదు, వాస్తవ జీవితంలో కూడా సామాజిక స్పృహ ప్రస్ఫుటించాలని సుంకవల్లి సత్తిరాజు సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇరు పాఠశాలలకు చెందిన ప్రధాన ఉపాధ్యాయులు, ఇతరులు పాల్గొని సుంకవల్లి సత్తిరాజు సేవానిరతిని అభినందించారు.

## 16న గ్రామీణ సమ్మెకు రైతులు వ్యవసాయ కూలీలు ముందుకు రావాలి

**– వ్యవసాయ కార్మిక సంఘము రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపు**




**పెరవలి, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ సమ్మెను రైతులు వ్యవసాయ కూలీలు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారుఫిబ్రవరి 12వ తేదీ సోమవారం ఉదయం నుండి పెరవలి మండలం ముక్కామల అన్నవరప్పాడు, ఖండవల్లి, కానూరు, తదితర గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ,రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ,వ్యవసాయ కూలీల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులుపి నాగేశ్వరరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి కొండలరావులు మాట్లాడుతూ ఈనెల 16న తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు పోస్ట్ ఆఫీస్లు ఎల్ఐసి లు తదితర కేంద్రసంస్థలన్నీ స్వచ్ఛందంగా మూసివేయాలన్నారు దేశానికి వెన్నుముక అయినా రైతు ఇప్పటికీ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నాడని కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోకుండాతాత్సరంచేస్తున్నారని డాక్టర్ స్వామినాథన్ కు భారతరత్న ఇవ్వడంగర్వకారణమని అయితే స్వామినాథన్ సూచించిన సమస్యలను మాత్రం పరిష్కారం చేయరని కనీసం గిట్టుబాటు ధర ఇవ్వడంలేదని వారు వాపయ్యారు ఈనెల 16న జరిగే సమ్మెకు విద్యార్థి సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు అన్ని రాజకీయ పార్టీలు గ్రామీణ బంద్ కు సహకరించాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పెరవలి మండలం కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, ముక్కామల కార్యదర్శి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్.పి. ఎస్.సతీష్ కుమార్ సోమవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం నందు "స్పందన" కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. మరియు అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.జె.వి.భాస్కరరావు ప్రత్యక్షంగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను విని, సమస్యలను సత్వరం పరిష్కరించ వలసినదిగా సంబంధిత పోలీస్ అధికారులకు తగు ఆదేశాలను జారీ చేసారు. 'స్పందన' కార్యక్రమమునకు వచ్చిన ఫిర్యాదుదారులకు ఉచిత భోజన సదుపాయంను కాకినాడ రామారావుపేటకు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ డి.పి.ఆర్.స్వామి, అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా కల్పించినారు. సోమవారం నిర్వహించిన "స్పందన" కార్యక్రమానికి మొత్తం 58 ఫిర్యాదులు రాగా (మహిళలు–36 & పురుషులు–22 ), వాటిలో సివిల్ వివాదాలకు సంబంధించి–14, కుటుంబ తగాదాలు–20 మరియు ఇతర సమస్యలకు సంబంధించిన 24 ఫిర్యాదులు అందినవి. సదరు ఫిర్యాదులపై సమగ్ర విశ్లేషణ చేసి, సంబంధిత సర్కిల్ మరియు స్టేషన్ అధికారులు సత్వరం విచారణ పూర్తి చేసి, పరిష్కారం చేయాలని, తగు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి.తోపాటు అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.జె.వి.భాస్కరరావు, అదనపు ఎస్పీ (ఎ.ఆర్) బి.సత్యనారాయణ, మరియు ఎస్.ఐ. లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ జోన్ డిఎస్పీగా అంబికా ప్రసాద్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:** రాజమహే ంద్ర వరం సౌత్ జోన్ డిఎస్పీగా బదిలీపై వచ్చిన ఎమ్. అంబికా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కే. మాధవీలత ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచ ేశారు. 1991 బ్యాచ్ కి చెందిన అంబికా ప్రసాద్ డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి సాధారణ బదలీ లలో భాగంగా తూర్పు గోదావరీ జిల్లా కు రావడం జరిగింది.

## గౌతమి జీవ కారుణ్య సంఘమును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సోమవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి స్థానిక గౌతమి జీవ కారుణ్య సంఘమును సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. నివాస గదులు, పరిసరాలు, వంటశాలను పరిశీలించి, వృద్ధులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. క్రమబద్ధంగా ఆహారం తీసుకోవాలని, మందులు వేళకు వేసుకోవాలని చెప్పారు. అనారోగ్యంగా ఉన్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. ఆ తరువాత కె.వి. స్టేట్ హెూమ్ ను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల, వసతి గృహం నిర్వహణా వ్యవస్థ గురించి అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణ పాటిస్తూ మంచిగా చదువుకోవాలన్నారు. హెూం నందు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, తప్పనిసరిగా ప్రభుత్వం ఆదేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని అక్కడి అధికారులను, సిబ్బంది నీ ఆదేశించారు.

# స్వచ్ఛత మనందరి బాధ్యత..



- ధవళేశ్వరం ఓవర్ హెడ్ ట్యాంకు మరమ్మతులు కొరకు రు.40 లక్షలు మంజూరు ప్రతిపాదనలు
- ప్రస్తుతం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు అదనంగా మరో ట్యాంక్ నిర్మాణం కొరకు వ్యయ ప్రతిపాదనల సిద్ధం చెయ్యాలి
- తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు
- మెరుగైన శానిటేషన్, డ్రైనేజీ మురుగు నీటిపారుదల అయ్యే విధంగా అధికారులు దృష్టి సాదించాలి
- ప్రజారోగ్య పరిరక్షణ కొరకు కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చుదిద్దుదాం

-మంత్రి వేణుగోపాలకృష్ణ

**ధవళేశ్వరం, మేజర్‌న్యూస్ :** ధవళేశ్వరం గ్రామానికి త్రాగునీరు సరఫరా కోసం ప్రస్తుతమున్న మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ కు అదనంగా మరో ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే వ్యయ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాల సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి రాజమండ్రి రూరల్‌కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛత మనందరి బాధ్యత.. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి వేణుగోపాల కృష్ణ సచివాలయం-5 ధవళేశ్వరం ఎర్ర కొండ ప్రాంతంలో అధికారులు స్థానిక నాయకులతో కలసి పర్యటించి మెరుగైన శానిటేషన్, త్రాగునీరు వంటి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులకు సూచినలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ ధవళేశ్వరం గ్రామానికి గోదావరి నది నుండి త్రాగునీరు సరఫరా చేసే రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు మరమ్మతులు కొరకు రు. 40 లక్షల అవసరమవుతుందని ఆ మేరకు ఇంజనీరింగ్ అధికారులు నిధులు మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని పేర్కొన్నారు. నిధులు రాగానే పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు మరో అదనపు ఓవర్ హెడ్ ట్యాంకర్ నిర్మాణం అవసరముందని, అందుకు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులు సూచించారు. త్వరలో మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాల కృష్ణ ధవళేశ్వరం ఎర్ర కొండ ప్రాంతంలోని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసు కున్నారు. స్వచ్ఛత మన అందరి బాధ్యతని గ్రామ ప్రజలు కాలుష్యం లేని విధంగా శుభ్రతను పాటించటం వలన ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ గ్రామంలోని శానిటేషన్ పనులను స్వయంగా పరిశీలించి , ప్రతిరోజు చెత్త ఎక్కడా లేకుండా, డ్రైనేజీ మురుగునీరు పారుదల అయ్యే విధంగా పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలో మట్టికుండలు తయారుచేసి విక్రయిస్తున్న మహిళతో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనం పొందారా అని అడిగి తెలుసు కున్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి ఏ కారణం చేతైనా పథకం యొక్క ప్రయోజనాన్ని పొందలేని వారికి కూడా గుర్తించి దరఖాస్తు చేసిన వెంటనేఆయాపథకాల ప్రయోజనాన్ని లబ్ధిదారులు అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ పర్యటనలో ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ డీఈ..టి. శ్రీనివాస్ బాబు, జేఈ.. బి. శ్రీనివాస్, ఎంపీడీవో డి. శ్రీనివాస రావు, జిల్లా వొక్ బోర్డు డైరెక్టర్ మహమ్మద్ కరీం భాషా (షట్టర్ భాష), స్థానిక నాయకులు బొడ్డేటి శివాజీ, బోడపాటి కుమార్., గొన్న సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు అందుబాటులో లేని రోడ్డుమార్గం

- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- ముఖం చాటేస్తున్న ప్రజాప్రతినిధులు
- పట్టించుకోని ఐ. టి.డి.ఏ...



**దేవిపట్నం, మేజర్ న్యూస్ :** మండలంలోని తున్నూరు పంచాయతీ పరిధిలో మామిడి వలస, చింతల గూడెం గిరిజన గ్రామాలకు రాకపోకలు సాగించా లంటే సరైన రోడ్డు మార్గం లేదని వాపోతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లాలంటే రంపచోదవరం మండలంలోని వేముల కొండ గ్రామం నుండి ప్రయాణించాలి. వేములవాడ నుండి సుమారు 7 కిలోమీటర్లు రాళ్లతో నిండిన దారుణమైన దారిలో వెళ్ళాలి .ఇప్పటికి సంబంధిత ఐ. టి.డి.ఏ. వారు,ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదని ఆ బాధలు వర్ణనాతీతమని తెలిపారు. ఇక్కడి వారికి వైద్యసేవలకు వెళ్లాలంటే మండలంలోని ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లవలసి వస్తుందని, ముదుసలివారు, చిన్నపిల్లలు, గర్భిణీలు వైద్య సేవలు పొందడానికి ఇందుకూరుపే ఎట వెళ్లాలంటే ఈ రదారి వల్ల ఇబ్బందులు పాలవుతున్నారని తెలిపారు.రేషన్ బియ్యం కోసం కొయ్యలగూడెం వెళ్ళవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతి నిధులు,సంబంధిత ఐ.టి.డి.ఏ వారు స్పందించి మాగ్రామాలకు రోడ్డుమార్గం కల్పించాలని కోరుతు న్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ పెద్దాపురం పట్టణంలోని (శెట్టిపేట (1), బి.సి-బి) అంగన్‌వాడి వర్కర్ పోస్టుకు ధరఖాస్తు ఆహ్వానించడం జరిగిందని, పెద్దాపురం ఐసిడిఎస్ సిడిపిఓ జి.ఉష తెలిపారు. అర్హులైన అభ్యర్ధులు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పెద్దాపురం కార్యా లయం నుండి నోటిఫికేషన్ జారీ చేసిన తేది (ది.12-2-2024) నుండి ధరఖాస్తులు పొంది పూర్తిస్థాయిలో ధరఖాస్తు పూర్తి చేసి ధరఖాస్తులను సంబంధిత ధ్రువ పత్రాలను (అటెస్టెడ్) జతపరిచి ఇదే కార్యాలయంలో 22-2-2024 తేది లోగా అందజేసి రశీదు పొందవలెనని సిడిపిఓ తెలిపారు. మరిన్ని వివరాలుకు కార్యాలయం పని వేళలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

## ఆర్డీఓ స్పందనకు 11 అర్జీలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 11 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ జి.ఉష, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివైఇఓ కార్యాలయ సిబ్బంది జె.రాంబాబు, డిఎల్‌పిఓ కార్యాలయ సిబ్బంది సత్యనారాయణ, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, డిటి భానుకుమార్, దయానందరాజు, నారాయణ, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణి



- సరికొత్త ఫీచర్లు, విస్తరించిన ప్రయోజనాలతో కూడిన కార్డులు అందజేస్తున్న ప్రభుత్వం
- అడిషనల్ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రజలందరికి మంచి ఆరోగ్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం సరికొత్త ఆరోగ్య శ్రీ కార్డులను వైద్యశాఖ అందజేస్తుందని కాకినాడ అడిషనల్ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఆరోగ్య శ్రీకార్డులు కొత్త ఫీచర్లతో కూడిన డా.వైయస్సార్ ఆరోగ్య శ్రీపథకం కార్డుల పంపిణి కార్యక్రమం పెద్దాపురం డివిజన్ స్థాయిలో వేగవంతంగా సాగుతుందని, 5 లక్షల లోపు వార్షికాదాయం కలిగిన కుటుంబాలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తాయని, వీరికి నూతన కార్డులు పంపిణి చేయడం జరిగిందని, ఆమె తెలిపారు. కొత్త కార్డులు అందజేయడంతో పాటు పథకం క్రింద ఉచితంగా పొందే వైద్య సేవలు వాటిని ఎలా పొందాలో కూడా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో విలువ ఇస్తుందని, ఈ పథకానికి మరింత సమర్ధవంతంగా పనిచేసేలా తీర్చిదిద్దడం జరిగిందని, గతంలో కేవలం తెల్ల రేషన్‌కార్డుదారులకు మాత్రమే ఈ పథకం పరిధిలోనికి వస్తుండగా, రూ.5లక్షల లోపు వార్షికాదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలను కూడా ఆరోగ్య శ్రీ పథకంలోకి తీసుకురావడం జరిగిందని, అంతేగాకుండా ఈ పథకం క్రింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందజేస్తున్నారని తెలిపారు. అలాగే వందలాది చికిత్సలను ఇందులో కొత్తగా చేర్చడం జరిగిందని, ఈ తరహా ప్రయోజలన్నిటితో కూడిన కార్డులను పంపిణి చేయడం జరుగుతుందని, ఆమె తెలిపారు. కార్డుల పంపిణి సమయంలోనే ప్రతి కుటుంబానికి పథకం సేవలను సులవుగా ఎలా పొందాలో వివరిస్తూ బ్రోచర్‌ను అందజేస్తూ, పథకం సమగ్ర సమచారం ఈ బ్రోచర్‌లో ఉటుందని, ఇది ప్రజలకు ఒక గైడ్‌లా ఉపయోగపడుతుందని లబ్దిదారుల మొబైల్ ఫోన్‌లో ఆరోగ్య శ్రీ సిటిజన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించడం జరుగుతుందని, అందులో లాగిన్ అయి ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలు రాష్ట్రంలో, రాష్ట్ర వెలుపల ఉండే నెట్‌వర్క్ ఆసుపత్రులు, వాటిలో ఏ ప్రొసిజర్స్‌కు వైద్యం చేస్తారన్న సమచారం యాప్ ద్వారా తెలుసుకోవచ్చునని, ఈ పథకం లబ్దిదారులు తాము ఉంటున్న ప్రాంతానికి చేరువలో ఏ ఆసుపత్రి ఉందో తెలుసుకోవచ్చునని, అక్కడకు చేరుకోవడానికి జి.పి.ఆర్.ఎస్. సౌకర్యం కూడా ఉందని ఆమె తెలిపారు. గతంలో ఈ పథకం ద్వారా పొందిన చికిత్సలు, రిపోర్టులను ఒక క్లిక్‌లో పొందడానికి వీలు ఉంటుందని ఆమె సూచించారు. ఈ ఆరోగ్య శ్రీ కార్డులో ఉండేవి కుటుంబ యజమాని పేరు, జిల్లా, మండలం, గ్రామ / వార్డు సచివాలయ వివరాలు, కుటుంబ సభ్యుల ఫోటోలు, వారి పేర్లు, ఇతర వివరాలు, యూనిక్ హెల్త్ ఐడెంటిటి నెంబరు (యుహెచ్ఐడి), క్యూఆర్.కోడ్ (వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్ళినపుడు ఆరోగ్య మిత్ర, వైద్యులు సులువుగా కేసు రిజిస్ట్రేషన్ చేయడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుందని, దీనివలన మరింత వేగంగా, సులభంగా వైద్యసేవలు అందుతాయని, అడిషనల్ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత తెలిపారు.

## పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



- చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘంలో పారిశుద్యంపై మున్సిపల్ శానిటేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ లు ఆదేశించారు. సోమవారం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో పారిశు ద్యంపై మున్సిపల్ శానిటేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పట్టణ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ద తీసుకోవాలని, అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తులికి సత్యభాస్కరరావు, పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డులలోని సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఇ ఆదినారాయణరావు, మున్సిపల్ టిపిఓ , ఎస్సై దావీదురాజు, మేనేజర్ యు.జ్యోతిరాణి, ఏఇలు కృష్ణ జీవప్రసాద్, ఆర్వో వేదుల చంద్రశేఖరం, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలకు త్వరితగతిన పరిష్కారం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమండ్రి డివిజన్ పరిధిలో అర్జీల రూపంలో వచ్చిన ప్రజా సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో త్వరిత గతిన నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరిస్తామని కె ఆర్ సి తాసిల్దార్ ఎస్ సత్యనారాయణ రాజు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరపున కేఆర్సీ తాసిల్దార్ సత్యనారాయణ రాజు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వచ్చిన 14 అర్జీలను స్వీకరించారు. ఈరోజు పెన్షన్, పట్టాదారు పాసు పుస్తకము మంజూరు, విద్యుత్, డ్రైనేజీ మంచినీరు సరఫరా , టిడ్ కో గ్రహాల మంజూరు, పౌరసరఫరాలు, హౌసింగ్ తదితర అంశాలకు సంబంధిచి 14 మంది నుంచి అర్జీలను స్వీకరించా మన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కొరకు ప్రభుత్వం స్పందన కార్యక్రమం తో పాటు జేకేసి కూడా ఏర్పాటు చేసిందని డివిజన్ స్థాయి అధికారులు ప్రజా సమస్యలను నిర్ణయిత పాలకొరిదిలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జిఎఎల్ఎస్. దేవి, మునిసిపల్ కార్పొరేషన్, డివిజనల్ పంచాయతీ అధికారి, ఐసిడిఎస్ సివిల్ సప్లైస్, బిసి వెల్ఫేర్, ఏపీఎస్ఆర్టీసీ, హౌసింగ్, ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూఎస్, ఫైర్, సాంఘిక సంక్షేమ, వైద్య, ఆరోగ్య, లేబర్, పశుసంవర్ధక, పరిశ్రమలు, డాక్టర్ ఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల సన్నద్ధత



- గోపాలపురం నియోజకవర్గంలో ఈఆర్‌వో పర్యటన
- పోలింగ్ బూత్‌లు సమస్యాత్మక కేంద్రాలను పరిశీలిస్తున్న యంత్రాంగం - ఎన్నికల ఏర్పాట్లుపై అధికారులతో సన్నద్ధ సమావేశాలు

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలైంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ..ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే గోపాలపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి(ఈఆర్‌వో)గా కేఎల్.శివజ్యోతి ఇటీవల బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో అధికారుల్లో ఎన్నికల నిర్వహణ పనులపై వేగం పెరిగింది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తహశీల్దార్లతో ఈఆర్‌వో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మరో వైపు నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాలకు చెందిన ఎమ్మార్వోలను కూడా బదిలీలు చేసిన ఉన్నతాధికారులు కొత్తవారిని నియమించారు. దీంతో యంత్రాంగంఅంతా నిమిషం తీరికలేకుండా ఎన్నికల విధుల్లో నిమగ్నమైయున్నారు.

**- రాజకీయ పార్టీలతో ఇప్పటికే సమావేశం:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై ఆయా పార్టీల నాయకులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి వ్యవహరించాల్సిన తీరు..ఎన్నికల కమిషన్ల నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకారం అందించాలని అధికారులు కోరారు. మరోవైపు ఓటు ప్రాధాన్యతపై ఇప్పటికే పలు గ్రామాల్లో కొత్తగా ఓటు వచ్చిన యువతకు అవగాహన కల్పించాలరు.బీఎల్‌వోలుగా పరిచేస్తున్న మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన మౌళిక వసతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు చేరవేసే పనిలో ఉన్నారు.

## జగనన్నకు చెబుదాం-స్పందనకు 403 అర్జీలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగన న్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్డీఏ కె.శ్రీరమణిబీ సీపీవో పీ.త్రినాథ్, డీపీవో కె.భారతి సౌజన్య, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణ మూర్తిలతో కలిసి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి సావధానంగా సమస్యలు విని అర్జీలను స్వీకరిం చారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించవలసిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలుజారిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబం ధించి మొత్తం 403 అర్జీలు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రజా సమ్యయల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబందిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. రీఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి శాస్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారి డేటా ఎంట్రీ బాధ్యత డిడివోలదే

- స్పందనలో వచ్చిన అర్జీలు..162
- అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి...
- కలెక్టరు డా.కే.మాధవీలత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే నిమిత్తం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వివరాలు డేటా ఎంట్రీ ప్రక్రియను చేపట్టి, నిర్ధేశించిన గడుపు లోపు పూర్తి చేసే బాధ్యత ఆయా డి డి వో లదే అని జిల్లా కలెక్టరు డా. కే. మాధవీలత స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా. కే.మాధవీలత , డీఆర్వో జి. నరసింహులు, టూరిజం ఈడి వి. స్వామీ నాయుడు, ట్రైనీ ఎస్ డి సి పి. సువర్ణ లు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు డా. కే.మాధవీలత మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేడు జిల్లా స్థాయి స్పందన లో ప్రజల నుంచి 162 అర్జీలను స్వీకరించామన్నారు. వాటిలో ఆన్ లైన్ లో 143 , ఆఫ్ లైన్ లో 19 స్వీకరించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదిక స్పందన, జేకేసీలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీ-ఓపెన్ కాకుండా ప్రజా సమస్యల పరిష్కార అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి నాణ్యతతో కూడిన విధంగా అధికారులు పరిష్కరించాలన్నారు. నేటి స్పందన లో రెవెన్యూ 65, హెూం 17, పంచాయితీరాజ్ ఫ్ర ఆర్ డి 15, విద్యుత్ 12, ట్రాన్స్పోర్టు 6, వైద్య ఆరోగ్యశాఖ 5, హౌసింగ్ 4, అటవీ, పురపాలక, మహిళా సంక్షేమం కి చెంది 3 చొప్పున, వ్యవసాయం, ల్యాబర్, వాటర్ రిస్సోర్సు డిపార్టుమెంట్స్ 2 చొప్పున, పశుసంవర్ధక, ఫైనాన్స్, విద్య, పరిశ్రమలు శాఖలు సంబందించి ఒక్కొక్కటి ప్రజలను అర్జీలను స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే పిఓ, ఏపీవో, సహాయ సిబ్బంది వివరాలను ఆన్ లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను నిర్ణీత గడవు లోపు చేయాలని కలెక్టరు జిల్లా అధికారులకు సూచించారు. ఈ బాధ్యత సంబంధిత డి డి వో లు వహించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహణలో ఏ ఒక్కరికీ మినహాయింపు వుండదన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకి, సిబ్బందికి త్వరలో పోలింగ్ ప్రక్రియ పై వర్క్ షాపు నిర్వహించడం జరుగుతుందని కలెక్టరు పేర్కొన్నారు.

## ప్రతీ అర్జీదారునికి సంతృప్తితో కూడిన పరిష్కారం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలో స్పందనలో వచ్చిన ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సత్వర పరిష్కరించడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి 26 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో సత్వర పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనం తో కూడి సేవలు అందించాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం సింహాచలం నగర్ కు చెందిన క్వారీ నుంచి వచ్చే నుసి వలన ప్రమాదాలు జరుగుతున్నాయని బర్రె కొండబాబు ఫిర్యాదు చేశారు. క్వారీ మార్కెట్ క్వారీ ఏరియాలో మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇప్పించవలసిందిగా కె సత్యనారాయణ కోరుట, కంబాల చెరువు వద్ద కొత్త షాపులు నిర్మాణానికి అనుమతించవలసిందిగా కోరుట, సంజీవనగర్ నందు అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని తొలగించవలసిందిగా డి. రామస్వామి ఫిర్యాదు తదితర అంశాలపై 26 వినతులు స్వీకరించామన్నారు.స్పందన కార్యక్రమంలో మున్సి పల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి,ఎస్.ఈ.. జి పాండుర ంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 16న జరిగే బంద్‌ను విజయవంతం చేయండి

- వామపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపు

**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** ఈనెల 16న జరుగుతున్న పారిశ్రామిక మరియు గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం దేవరపల్లిలో ఉండవల్లి కృష్ణారావు ఇంటి వద్ద ఐఎఫ్టియు నాయకులు సిహెచ్ రమేష్ అధ్యక్షతన వామపక్ష కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ రైతుల పంటకు మద్దతు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని తదితర డిమాండ్ సాధన కోసం ఈ సమ్మె జరుగుతుందని తెలిపారు. దేశంలోని పలు కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందని తెలిపారు రవాణా రంగంలో తీసుకొచ్చిన చట్టాలు రవాణా కార్మికుల పట్ల శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు కనీస వేతనం 26,000గా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆచంట సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎస్ భగత్, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు ఎస్కె మస్తాన్ ఏఐఎఫ్టియు నాయకులు టీ పెంటయ్య రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు ,వ్యవసాయ కారం సంఘ నాయకులు కె. రత్నాజీ, ఐ ఎఫ్ టి యు కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.